క్లుప్తంగా

శిక్షణ కేంద్రాలుగా స్కూల్ కాంప్లెక్స్‌లు

ప్రకాశం నగర్: ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లు శిక్షణ కేంద్రాలుగా ఉపయోగపడుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను బుధవారం ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో ఎప్పటికప్పుడు తీసుకువస్తున్న మార్పులను కాంప్లెక్స్ సమావేశాల్లో చర్చించడం జరుగుతుందన్నారు. వాటిని ఉపాధ్యాయులు అవగాహన చేసుకుని పాఠశాల స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలలో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ ఎస్.రాజా ప్రశాంత్, కార్యదర్శి పరసా జగన్నాథరావు, సీఆర్పీ జయంతి శాస్త్రి, కోటేశ్వరి పాల్గొన్నారు.

రేపటి నుంచి రామాయణ మహాయాగం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ ఆశీసులతో కొంతమూరు గ్రామంలోని వల్లభ గణపతి ఆలయ ప్రాంగణంలో డిసెంబర్ ఒకటి నుంచి 11వ తేదీ వరకూ వాల్మీకి మహర్షి విరచిత రామాయణ మహాయాగానుష్టానం జరుగుతుందని ఆలయ ట్రస్టీ, భాగవతవరించి డాక్టర్ టీవీ నారాయణరావు తెలిపారు. రాజమహేంద్రవరంలోని హిందూసమాజంలో బుధవారం ఆ వివరాలను వెల్లడించారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ యాగం నిర్వహణ, తిరిగి సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకూ నీరాజన మంత్రపుష్పాలు, దర్బారు సేవలు జరుగుతాయన్నారు. డిసెంబర్ 11వ తేదీ ఉదయం జరిగే పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, కార్తిక సమారాధనలో సామవేదం షణ్ముఖశర్మ పాల్గొంటారన్నారు. డిసెంబర్ 13 నుంచి 2024 జనవరి 23వ తేదీ వరకూ 42 రోజుల పాటు సాయంత్రం 5.20 గంటల నుంచి హిందూసమాజంలో ఆయన రామాయణ ప్రవచనాన్ని అందిస్తారన్నారు. జనవరి 23వ తేదీన శ్రీరామచంద్రుని పట్టాభిషేక మహోత్సవం ఘనంగా జరుగుతుందన్నారు.

సేవలు అభినందనీయం

కడియం: కొండేటి సుజానమ్మ, విజయరత్నం చారిటబుల్ ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎస్ఏకేవీటీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పాలపర్తి ఏబెల్ రాజబాబు అన్నారు. మండలంలోని దామిరెడ్డిపల్లిలో ట్రస్టు శిలాఫలకాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ట్రస్టు చైర్మన్ కొండేటి సూర్యారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెంకట్రావు, ఫ్రాన్సిస్, ఐ.సురేష్, ప్రసాద్, సూర్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిసెంబరు 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్న రీజినల్ లెవెల్ 26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఆ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన బాలురు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. 33 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు హాజరవుతారన్నారు. పాలిటెక్నిక్ కళాశాల డిపార్ట్‌మెంట్ హెడ్‌లు, లెక్చరర్లు, పరిపాలనాధికారి పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ పంపిణీ



బాలుడికి పోషకాహార కిట్ అందజేస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: పిల్లల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. బంగారుకొండ కార్యక్రమం ద్వారా ఆయన దత్తత తీసుకున్న గోరక్షణపేటలోని షేక్ ఫారూక్ ఆరోగ్య పరిస్థితిపై బుధవారం ఆరా తీశారు. ఆ బాలుడికి పౌష్టికాహార కిట్‌ను అందజేశారు.

యూటీఎఫ్ సమావేశం

ప్రకాశం నగర్: యూటీఎఫ్ పోరాట కార్యాచరణలో భాగంగా బుధవారం స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ ఉపాధ్యాయుల సన్నాహక సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన పి.జయకర్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర సంఘం ఇచ్చిన కార్యాచరణ మేరకు దశల వారీ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.

వరిపంటను కోస్తున్న యంత్రం



చకచకా కోతలు.. వేగంగా కొనుగోళ్లు

- చురుగ్గా వ్యవసాయ పనులు
- బిజీగా అన్నదాతలు

కడియం: మండల పరిధిలో వరి కోతలు వడివడిగా సాగుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో వాతావరణ ఒకింత ఆందోళన కలిగించినప్పటికీ, ఇప్పుడు సహకరించడంతో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అంతే వేగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను కూడా చేపడుతోంది. దీంతో ఒక పక్క కోతలు, మరో పక్క ధాన్యం ఆరబెట్టడం, ఇంకో పక్క ధాన్యం ఎగుమతులతో రైతాంగం బిజీబిజీగా ఉంది.

ఆరువేల హెక్టార్లలో..

రూరల్ నియోజకవర్గం పరిధిలో సుమారు ఆరు వేల హెక్టార్ల పరిధిలో వరి సాగు చేస్తున్నారు. వీటిలో దాదాపు 60 శాతం వరకూ కోతలు పూర్తయినట్లు ఆయా మండలాల వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నారు. కడియం మండలం పరిధిలో 2,880 ఎకరాల్లో కోతలు ఇప్పటి వరకూ పూర్తి కాగా, 7,560 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వచ్చిందని మండల వ్యవసాయాధికారి ద్వారకాదేవి తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ఐదు రోజుల్లోపు ధాన్యం సొమ్ముకు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతోందన్నారు. నేరుగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బంది సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.



ధాన్యాన్ని అమ్మకానికి సిద్ధం చేస్తున్న రైతులు

గత ఏడాదికి భిన్నంగా..

సరిగ్గా గత ఏడాది ఇదే సమయంలో రైతులకు సాంకేతికంగా పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. కొత్త సాంకేతిక విధానం, కొనుగోలు ప్రక్రియపై సిబ్బంది పూర్తి స్థాయి అవగాహన ఏర్పడకపోవడంతో రైతులు కొంత మేర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది వరికోతలకు నెల రోజుల ముందు నుంచే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, అక్కడ అవసరమైన పరకరాలను రప్పించడం, తగినంత మంది సిబ్బందిని అందుబాటులో ఉంచడం వంటి చర్యలను చేపట్టారు. అలాగే గన్నీబ్యాగులను కూడా డిమాండ్‌కు సరిపడా ముందుగానే తీసుకువచ్చి ఆయా ఆర్బీకేల పరిధిలో అందుబాటులో ఉంచారు. ముందస్తుగా చేపట్టిన ఈ చర్యల కారణంగా ధాన్యం అమ్మకాల్లో రైతులకు ఇబ్బంది తప్పాయి. అంతే కాకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తయిన ఐదో రోజున సంబంధిత ధాన్యం సొమ్ము రైతు అక్కౌంట్‌కు జమ అవుతోందని రైతులే హర్షం వ్యక్తం చేస్తున్నారు.

> **పారదర్శకంగా..**
> మండల పరిధిలో పూర్తి పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగుతోంది. రైతుల ఎదురుగానే తేమ శాతం లెక్కిస్తున్నారు. అలాగే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద వ్యవసాయ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు.
> – కె.ద్వారకాదేవి, మండల వ్యవసాయాధికారి, కడియం

వాస్తవ ఘటనలతో ‘ఉక్కు సత్యాగ్రహం’

- దర్శకుడు, హీరో సత్యారెడ్డి
- డిసెంబర్ రెండో వారంలో విడుదల

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విశాఖ స్టీల్‌ప్లాంట్ సాధన కోసం ఆనాడు జరిగిన పోరాటం, దాని పరిరక్షణ కోసం ఇప్పుడు జరుగుతున్న పోరాటాల ఇతివృత్తంతో రూపొందించిన ‘ఉక్కు సత్యాగ్రహం’ సినిమా డిసెంబర్ రెండో వారంలో విడుదల చేస్తున్నట్టు ఆ చిత్ర దర్శకుడు, హీరో సత్యారెడ్డి తెలిపారు. ఆయన కథానాయకుడిగా నటిస్తూ స్వీయ నిర్మాణ, దర్శకత్వంలో తెరకెక్కించిన ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఉదయం విలేకరుల సమావేశం నిర్వహించారు. సత్యారెడ్డి మాట్లాడుతూ జనం ఎంటర్‌టైన్‌మెంట్‌సంస్థ తెలుగుసేన బ్యానర్‌పై నిర్మించిన ఈ సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు, సెన్సార్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉందన్నారు. ఈ చిత్రంలో ప్రజా గాయకుడు గద్దర్ కీలక పాత్ర పోషించడంతో పాటు నాలుగు పాటలు రాశారన్నారు. గాజువాక పల్సర్ బైక్ ఝాన్సీ హీరోయిన్‌గా పరిచయమవుతోందని, వైజాగ్ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మేఘన, స్టీల్‌ప్లాంట్ పోరాట కమిటీ నాయకులు అయోధ్య రామ్, ఆదినారాయణ, వెంకట్రావు, ప్రసన్న కుమార్, కేఎస్ఎన్ రావ్, మీరా, పల్నాడు శ్రీనివాస రెడ్డి, రమణా రెడ్డి, హనుమయ్య, అప్పికొండ అప్పారావ్, బాబాన్న, సింగ్ తదితరులు కీలకపాత్రలు పోషించారన్నారు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా మూవీగా 300 థియేటర్లలో విడుదల చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కో డైరెక్టర్ రంగనాథ్, సహ నిర్మాత జక్రయ్య పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న దర్శకుడు, హీరో సత్యారెడ్డి

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరిగిందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని పలు సచివాలయాల్లో బుధవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 44వ డివిజన్ 77వ సచివాలయం పరిధిలో సుమారు 15.82 కోట్ల నిధులు లబ్ధిదారులు ఖాతాలో జమ అయ్యాయని, రూ.1.09 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. 9వ డివిజన్‌లోని 17వ నంబర్ సచివాలయం పరిధిలో సుమారు రూ.18.64 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో వేశారని, రూ.1.74 కోట్ల అంచనా విలువ కలిగిన పనులు జరుగుతున్నాయన్నారు. 23వ డివిజన్ 58వ సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు సుమారు రూ.12.23 కోట్ల లబ్ధి, సుమారు రూ.2.89 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయన్నారు. 40వ డివిజన్ 68వ నంబర్ సచివాలయం పరిధిలో రూ.2.04 కోట్ల పనులు జరుగుతుండగా, సుమారు రూ.12.26 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

సంక్షేమమే ప్రధాన అజెండా

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 32వ డివిజన్‌లో పార్టీ ఇన్‌చార్జి ముప్పన శ్రీను ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరత్నాలతో ప్రజలకు అండగా నిలిచిన జగన్.. ఈ నాలుగేళ్లలో ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించారన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతి వేగం ప్రమాదకరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారులు, ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులతో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్కూల్ పిల్లలను తీసుకెళుతున్న ఆటో, బస్సు డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించి ఎక్కువ మందిని ఆటోలో ఎక్కించుకోవడం మరింత ప్రమాదకరమన్నారు. నల్సావారి అసంఘటిత రంగ కార్మికులకు న్యాయసేవల పథకం, 2015 ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. వారందరినీ ఈ-శ్రమ్ కార్డుల కోసం నమోదు చేసుకోవాలని, ఈ ప్రక్రియలో సమస్య ఉంటే సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, జిల్లా ఏఎస్పీ (లాఅండ్ఆర్డర్) ఎం.రజిని, ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.రామనారాయణ పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: వరల్డ్ ఎయిడ్స్ డే (డిసెంబర్ 1)ను పురస్కరించుకుని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు రాజమహేంద్రవరం కోటిలింగాలరేవు వద్ద గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ముగ్గులు పోటీలు, 4 గంటల నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డా.వసుంధర బుధవారం ప్రకటన విడుదల చేశారు. అవగాహన ర్యాలీ కోటిలింగాల రేవు నుంచి కోటిలింగాలపేట అంబేడ్కర్ విగ్రహం వరకూ జరుగుతుందన్నారు. శుక్రవారం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధ్యక్షతన జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కంబాలచెరువు పార్క్‌లో ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వ్యాధి బాధితులతో కలిసి కలెక్టర్ అల్పాహార విందులో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పురస్కారాలు, పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి కోసం ఇంటర్న్‌షిప్‌తో కూడిన శిక్షణ తరగతులు నిర్వహించాలని కలెక్టర్ మాధవీలత అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం వికాస, ఇండస్ట్రీస్, తదితర సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ యువతకు చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సుమారు 10,485 మంది విద్యార్థులకు వివిధ సంస్థలలో ఆన్‌ది జాబ్ ట్రైనింగ్ ద్వారా శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించామన్నారు. నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఇతర గ్రామీణ, పట్టణ శిక్షణా సంస్థల భాగస్వామ్యంతో ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు, జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు మూర్తి, లీలావతి, డీఎస్‌డీఓ ఎం.కొండలరావు, ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సెలర్ ప్రొఫెసర్ జగన్మోహన్ రెడ్డి, వికాస ప్రతినిధి బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

15 నుంచి ‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడా పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు 15 ఏళ్లు పైబడిన వారందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రూరల్ మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కేఎస్ జ్యోతి అన్నారు. ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ లోగో, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం హుకుంపేటలోని మండల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా మండల కమిటీ చైర్మన్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కేఎస్ జ్యోతి మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వరకూ వివిధ స్థాయిల్లో పోటీలు జరుగుతాయన్నారు. వలంటీర్లు, 1902, ఆడుదాం ఆంధ్రా వెబ్‌సైట్ ద్వారా క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రారంభమైందన్నారు. పోటీల నిర్వహణకు మండలంలో 15 మైదానాలను ఎంపిక చేశామన్నారు. తహసీల్దార్ పైడి చిన్నారావు, మండల విద్యాశాఖాధికారి -1 అయ్యంకి దుర్గాతులసీదాస్ పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న మండల ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్

9 నుంచి పుణ్య క్షేత్ర యాత్ర ప్రత్యేక రైలు



పుణ్యక్షేత్ర యాత్ర బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ రైల్వే టూరిజం కేటరింగ్ కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో నడపనున్న పూరి,కాశీ,అయోధ్య భారత్ గౌరవ్ పర్యాటక ప్రత్యేక రైలును సద్వినియోగం చేసుకోవాలని ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ రాజా విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ వీవీపీ లాంజ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుణ్యక్షేత్ర యాత్ర ప్రత్యేక రైలు బ్రోచర్‌ను చీఫ్ సూపర్ వైజర్ వై.ప్రసాద్, స్టేషన్ మేనేజర్ రంగనాథ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ డిసెంబరు 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ నడిచే ఈ రైలు యాత్ర 9 రోజులు 8 రాత్రులుగా సాగుతుందన్నారు. సికింద్రాబాద్ నుంచి 9వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. అదే రోజు రాత్రి ఏడు గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటుంది. జిల్లాలో ఈ రైలు సామర్లకోట ప్రయాణీకులను ఎక్కించుకునేందుకు ఆగనున్నదన్నారు. ఈయాత్రలో పూరి, గయ, వారణాశి, అయోధ్య,ప్రయోగరాజ్‌లలో పుణ్యస్థలాలలను సందర్శించవచ్చు. రైలులో మూడు కేటగిరీల్లో (సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్) ప్రయాణ సౌకర్య అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఉద్యోగులు ఎల్టీసీ సౌకర్యాన్ని దీని ద్వారా వినియోగించుకోవచ్చునన్నారు. ఈ ప్రయాణ సమయంలో యాత్రికులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి డిన్నర్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణ టికెట్ల రిజర్వేషన్‌ను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఐఆర్‌సీటీసీ టూరిజం.కామ్ ద్వారా పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు ఐఆర్‌సీటీసీ ప్రతినిధులను 82879 32312, 92814 95848 నంబర్లలో సంప్రదించవచ్చునని వివరించారు.

ఎల్ఐసీ జీవన్ ఉత్సవ్ పాలసీ ఆవిష్కరణ



నూతన పాలసీని ఆవిష్కరిస్తున్న ప్రసాదరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా సంస్థ వారి జీవన్ ఉత్సవ్ పాలసీని ఆ సంస్థ డివిజనల్ కార్యాలయంలో బుధవారం సీనియర్ డివిజన్ మేనేజర్ బి.ప్రసాదరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నుకోబడిన కాలవ్యవధికి నిర్దేశించబడిన డిఫర్మెంట్ కాలపరిమితి తర్వాత పూర్తి జీవిత కాలంలో కచ్చితమైన రాబడి పొందే అవకాశం ఉందన్నారు. ప్రీమియం చెల్లించే కాల పరిమితిలో ప్రతి రూ.వెయ్యి బీమా మొత్తానికి రూ.40 గ్యారంటీ ఎడిషన్స్ ఆఫర్ చేయబడిందన్నారు. పాలసీదారుడు రెగ్యులర్ ఆదాయ సదుపాయం లేదా ఫ్లెక్సీ ఆదాయ ప్రయోజనం పొందవచ్చునన్నారు. పాలసీదారుని అభ్యర్థన మేరకు ప్రతి పాలసీ సంవత్సరంలో ఈ మొత్తంలో గరిష్ఠంగా 75 శాతం వరకూ తీసుకునే సదుపాయం కూడా కల్పించారన్నారు. మార్కెటింగ్ మేనేజర్ బీవీ కల్యాణ్ మాట్లాడుతూ మారుతున్న జీవిత ప్రమాణాలకు తగ్గట్టుగా, వడ్డీలో హెచ్చుతగ్గులకు అతీతంగా, పెరుగుతున్న జీవించే కాలానికి అనుగుణంగా ఈ పాలసీ ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో డివిజనల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గాయత్రీ హోమం, కార్తిక అన్నసమారాధన

రాజానగరం: కార్తిక మాసం సందర్భంగా రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం గాయత్రీ హోమం, అన్నసమారాధనలు జరగనున్నాయి. రామానందస్వామి దివ్య ఆశీసులతో ఆయన శిష్యపరివార్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో 11 యజ్ఞ కుండీలను ఏర్పాటు చేసి, 44 జంటలచే ఉదయం 8.30 గంటల నుంచి గాయత్రీ హోమం నిర్వహిస్తారు. ఉదయం 11 నుంచి ఆలయం పక్కనే ఉన్న మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో అన్నసమారాధనను జరుగుతుంది. గాయత్రీ హోమంలో పాల్గొనే వారికి ఆలయంలోనే హోమద్రవ్యాలను ఉచితంగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: తన కుమార్తె కనిపించడం లేదంటూ బొమ్మూరు చెరువు గట్టు ప్రాంతానికి చెందిన దేపల్లి భవాని బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. భవానికి 12 ఏళ్ల కుమార్తె లావణ్య ఉంది. ఆమె కాకినాడలో హాస్టల్‌లో ఉంటూ మున్సిపల్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేకపోవడంతో ఈనెల 24వతేదీన ఇంటికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం భవాని పనికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి కుమార్తె కనిపించలేదు. ఎస్సై మహమ్మద్ జుబేర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక కంబాలచెరువు సమీపంలోని చిరంజీవి పార్కు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని త్రీటౌన్ ఎస్సై టి.శ్యామ్‌సుందర్ తెలిపారు. సోమవారం రాత్రి సమయంలో సుమారు 45ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మద్యం తాగి అక్కడ పడిపోయాడు. గమనించిన స్థానికులు అతడిని చిరంజీవి పార్కు గోడకు ఆన్చి కూర్చొబెట్టారు. ఫిట్స్ వచ్చాయనుకుని అతడి చేతిలో తాళాలు పెట్టినప్పటికీ మాటలు ఆడలేదు. మంగళవారం మధ్యాహ్నం చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. టిఫిన్ సెంటర్ యజమాని మరదాపురి శ్రీను ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలి

కడియం: ఉపాధ్యాయుడు నిరంతరం తన వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈవో వి.లజపతిరాయ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరుగుతున్న తెలుగు పాఠశాల కాంప్లెక్స్ సమావేశంలో బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర అవకాశం ఉపాధ్యాయుడికే ఉందన్నారు. సమావేశంలో మండలంలోని వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.